ఇరుకు వంతెనతో ఇక్కట్లు

- మినీ బైపాస్ కన్నా ఎత్తుగా హనుమాన్ నగర్ వంతెన
- సరిగా లేని మార్జిన్లు
- తరచూ ప్రమాదాలు, ట్రాఫిక్ జామ్‌లు
- భయాందోళనలో ప్రజలు

ఏలూరు (టూటౌన్) : మినీ బైపాస్ రోడ్డులో కృష్ణా కెనాల్‌పై దశాబ్దాల క్రితం నాటి హనుమాన్ నగర్ వంతెన నేడు పెరిగిన రద్దీ, రవాణా అవసరాల రీత్యా ప్రజలకు అవసరాలకు సరిపోవడంలేదు. ప్రస్తుతం విస్తరిస్తున్న నగరం, పెరిగిన జనాభా, రవాణా అవసరాలు, తమ్మిలేరు గట్టు వెంబడి పెదపాడు మండల గ్రామాలకు రాకపోకలు వెరసి వంతెనపై తరచూ ట్రాఫిక్ జామ్ అవుతుంది. ఈ వంతెన మినీ బైపాస్ రోడ్డు కన్నా ఎత్తులో ఉండటం , ఇరువైపులా మార్జిన్లు సరిగా లేకపోవడం వల్ల తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి. ఏలూరు జూట్ మిల్లు సెంటర్‌లో కృష్ణా కాలువపై నిర్మిస్తున్న విధంగా హనుమాన్ నగర్ వంతెననూ విస్తరించాలని, ఇరువైపులా రోడ్డు మార్జిన్లు సరిచేయాలని ప్రజలు ముక్తకంఠంతో కోరుతున్నారు.

నిత్యం వాహనాల రద్దీ

మినీ బైపాస్ రోడ్డు నుంచి హనుమాన్ నగర్ వైపు వెళ్లే మార్గంలో ఉన్న వంతెన పై నిత్యం హనుమాన్ నగర్, ఎన్టీఆర్ కాలనీ, కొత్తూరు సుందరయ్య కాలనీ, వైఎస్సార్ కాలనీ, జర్నలిస్టుల కాలనీలతో పాటు పెదపాడు మండలం కొత్తూరు, పాతముప్పర్రు, కొత్త ముప్పర్రు గ్రామాల ప్రజలు రాకపోకలు సాగిస్తున్నారు. నిత్యం ఉదయం, సాయంత్రం వేళల్లో స్కూలు, కాలేజీలకు వెళ్లే విద్యార్థులు, ప్రభుత్వ, ప్రైవేట్ ఉద్యోగులు రాకపోకలు సాగిస్తుంటారు. ఆ సమయాల్లో వంతెనపై పెద్ద ఎత్తున ట్రాఫిక్ నిలిచిపోతుంది. సాఫీగా వెళ్లేందుకు అవకాశం ఉండడంలేదు. పెద్ద ఎత్తున వాహనాల సంఖ్య పెరిగిపోయింది. ద్విచక్రవాహనాలు, ఆటోలు వరకు ఇబ్బంది లేకపోయినా కార్లు, క్యారేజ్ ఆటోలు, ఇతర గూడ్స్ వాహనాలు రాకపోకలు సాగించే సమయంలో ట్రాఫిక్ జామ్ అవుతుంది. ఈ నేపథ్యంలో తరచూ ప్రమాదాలు సంభవిస్తున్నాయి.



హనుమాన్ నగర్ వెళ్లే మార్గంలో ఉన్న కృష్ణా కాలువ వంతెన



ఉదయం, సాయంత్రం వేళల్లో వాహనాల రద్దీ

కొత్త వంతెన నిర్మించాలి



పెరిగిన రవాణా అవసరాల రీత్యా మినీ బైపాస్ రోడ్డులో హనుమాన్ నగర్ వెళ్లే మార్గంలో కృష్ణా కెనాల్‌పై ఉన్న వంతెన స్థానంలో కొత్త వంతెన నిర్మించాలి. జూట్ మిల్లు సెంటర్‌లో నిర్మిస్తున్న వంతెన మాదిరిగా ఈ ప్రాంతంలోనూ వంతెన నిర్మించి ప్రజల ఇబ్బందులను తొలగించాలి.

– డీఎన్‌వీడీ ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి, సీఐటీయూ, ఏలూరు జిల్లా

మార్జిన్లు సరిచేయాలి



హనుమాన్ నగర్ వంతెనకు ఇరువైపులా మార్జిన్లు సరిచేయాలి. దశాబ్దాల క్రితం నాటి వంతెన నేటి ప్రజల అవసరాలకు సరిపోవడం లేదు. గత పదేళ్లలో ఈ ప్రాంతంలో జనాభా విపరీతంగా పెరిగింది. కొత్త వంతెన నిర్మాణానికి అధికారులు, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాలి.

– పంపన రవికుమార్, సీపీఎం నగర కార్యదర్శి, ఏలూరు

క్లుప్తంగా

సమైక్యతకు, సమగ్రతకు కృషి చేయాలి



సీపీఓ కార్యాలయంలో హర్‌ఘర్ తిరంగా కార్యక్రమం నిర్వహిస్తున్న దృశ్యం

ఏలూరు(మెట్రో): కలెక్టరేట్‌లోని సీపీఓ కార్యాలయంలో గురువారం హర్‌ఘర్ తిరంగా కార్యక్రమాన్ని పీపీఓ సీహెచ్ వాసుదేవరావు నిర్వహించారు. ప్రతి ఒక్కరూ దేశభక్తి కలిగి జాతీయ సమైక్యతకు, సమగ్రతకు కృషి చేయాలని సూచించారు. జాతీయ జెండా ఎంతో విశిష్టత ఉందని, పౌరులందరూ తమ ఇంటి వద్ద జాతీయ జెండాను పెట్టడం ద్వారా జాతీయ భావం ఉట్టిపడుతుందని, దేశ సమగ్రత, జాతీయ సమైక్యతకు త్రివర్ణ పతాకం స్ఫూర్తిగా నిలుస్తుందని వివరించారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బందితో కలిసి జాతీయ జెండా వద్ద సీపీఓ తదితరులు సెల్ఫీ దిగారు. అసిస్టెంటు డైరెక్టరు శ్రీదేవి, డిప్యూటీ ఎస్‌ఓలు జె.రాజశేఖర్, సీహెచ్ కేశవరావు, గంగాధర్, ప్రభాకర్‌రావు, డిస్ట్రిక్ విజన్ యాక్షన్ ప్లాన్ సిబ్బంది, కార్యాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పురావస్తు శాఖ ఆధ్వర్యంలో..

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పురావస్తు శాఖ ఆధ్వర్యంలో గురువారం స్థానిక అగ్రహారంలోని పురావస్తు ప్రదర్శన శాల నుంచి అగ్రహారం, మెయిన్ రోడ్లలో హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. ఏలూరు పురావస్తు ప్రదర్శన శాల ఇన్‌చార్జి స్వర్ణ సత్యవతి మాట్లాడుతూ ప్రతి పౌరునిలో దేశభక్తిని పెంపొందించడం ఈ ర్యాలీ ఉద్దేశమన్నారు. మానవత స్వచ్ఛంద సంస్థ సహకారంతో నిర్వహించిన ఈ ర్యాలీలో ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.

16న కృష్ణాష్టమి వేడుకలు

ఏలూరు (టూటౌన్): ఈ నెల 16న శ్రీకృష్ణాష్టమి వేడుకలు ఘనంగా నిర్వహించాలని ఏలూరు నగర యాదవ సంఘం నాయకులు కోరారు. తమ్మిలేరు ఏటిఒడ్డున ఉన్న ఏలూరు జిల్లా యాదవ సంఘం కార్యాలయంలో వారు సమావేశం నిర్వహించారు. శ్రీకృష్ణాష్టమి రోజు శనివారం ఉదయం జరిగే శ్రీ కృష్ణ భగవానుడి పూజల్లో ముఖ్య అతిథులుగా ఎంపీ పుట్టా మహేష్ యాదవ్, ఎమ్మెల్యే బడేటి చంటి పాల్గొంటారని తెలిపారు. ఆరోజు సాయంత్రం ఏడు గంటలకు ఉట్టుకొట్టే కార్యక్రమం ఉంటుందని, విజేతలకు మొదటి, రెండు, మూడో బహుమతులుగా రూ.5,116, రూ.3,116, రూ.2,116 ఇవ్వనున్నట్టు పేర్కొన్నారు. సమావేశంలో సంఘం అధ్యక్షుడు మెరుగుమాల శ్రీనివాసరావు, నాయకులు కిలారపు జగదీష్, మల్లిపూడి రాజు, డొక్కు మల్లేశ్వరరావు, కొమ్మ నాగరాజు, ఆవాలు శ్రీనివాసరావు, కొమ్మ హుస్సేన్, కొల్లిపర్రు నాగ శ్రీనివాసరావు, గొరిపర్తి గోవర్దన్, మసిముక్కల సాయి, రుద్రబోయిన రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

రొయ్యల రైతుల ఆందోళన

దెందులూరు: భారీ వర్షాలతో కొల్లేరులో రొయ్యల రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఏలూరు రూరల్ మండలంలో దాదాపు నాలుగు వేలు ఎకరాల్లో రొయ్యల చెరువులు ఉన్నాయి. ఒకవైపు అమెరికా అధ్యక్షుడు ట్రంప్ తీసుకున్న నిర్ణయాల వల్ల రొయ్యల ఎగుమతి దిగుమతుల విషయంలో ఇప్పటికే ఆర్థికంగా రైతులు నష్టపోయారు. మరోవైపు నాలుగు రోజులు పాటు భారీ వర్షాల ప్రకటన రైతులకు కంటిమీద కునుకు లేకుండా చేసింది. వర్షాల కారణంగా రొయ్యలకు వ్యాధులు వస్తాయని, రూ.లక్షల పెట్టుబడి నీటిపాలవుతుందని రైతులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

చార్టర్డ్ అకౌంటెంట్ల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (టూటౌన్): ఏలూరు జిల్లా నీటియాజమాన్య సంస్థ ద్వారా 2024 – 25 సంవత్సరానికి చేపట్టే వివిధ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు విధానం, అక్కౌంట్ల ఆడిట్‌కు ఛార్టర్డ్ అకౌంటెంట్ల నియామకానికి దరఖాస్తులు కోరుతున్నామని డ్వామా ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.వెంకట సుబ్బారావు తెలిపారు. ఆసక్తి ఉన్నవారు విద్యార్హతలు, అనుభవ పత్రాలతో ప్రాజెక్టు డైరెక్టర్, జిల్లా నీటి యాజమాన్య సంస్థ, ఏలూరు జిల్లా, ఏలూరు వారికి ఈనెల 15వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు దరఖాస్తులు పంపించాలని కోరారు.

ఎస్టీయూ నాయకులపై ఫిర్యాదు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): యూటీఎఫ్ ఏలూరు నగర ప్రధాన కార్యదర్శి జొన్నకూటి రాజారావుపై సోషల్ మీడియాలో అసత్య ప్రచారం చేస్తున్న ఎస్టీయూ నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆంధ్రప్రదేశ్ మాల ఉద్యోగుల సంఘం నాయకులు గురువారం జిల్లా విద్యాశాఖాధికారి ఎం వెంకట లక్ష్మమ్మకు వినతిపత్రం అందజేశారు. రాజారావుపై తప్పుడు ప్రచారం చేయడం 1989 ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టానికి విరుద్ధమని, ఈ వేధింపులు ఆపక పోతే రాష్ట్ర, జాతీయ ఎస్సీ కమిషన్‌ల దృష్టికి తీసుకువెళతామని, క్రిమినల్ కేసులు వేస్తామని హెచ్చరించారు.

వంతెనను డబుల్ చేయాలి

ఏలూరు (టూటౌన్): స్థానిక 19వ డివిజన్ పడమటిలాకుల పక్కనక ఉన్న హనుమాన్ నగర్ వంతెన (సింగిల్)ను డబుల్ చేయాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బి.సోమయ్య గురువారం ఒక ప్రకటనలో కోరారు. ఈ వంతెన ఇరుకుగా ఉండడంతో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతుందని పేర్కొన్నారు.

చెరువులను తలపించిన ఏలూరు

- మూతబడ్డ రాజీవ్ స్నేహవారధి
- ఉధృతంగా తమ్మిలేరు ప్రవాహం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): బుధవారం సాయంత్రం నుంచి గురువారం ఉదయం వర్షం పడుతునే ఉంది. దీంతో ఏలూరు నగరంలోని కొత్తూరు రోడ్డు, చిరంజీవి బస్‌షెల్టర్ రోడ్డు, కై కలూరు రోడ్డులోని ప్రేమాలయం ప్రాంతం ఇలా అనేక ప్రాంతాల్లో రహదారులు చెరువులను తలపించాయి. ముఖ్యంగా ఏలూరు కొత్త బస్టాండులో వాన నీరు ఎక్కడికక్కడే నిలిచిపోయి ప్రయాణికులకు చుక్కలు చూపాయి. ముఖ్యంగా పలు ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల ప్రాంగణాల్లో వాన నీరు చేరింది. తంగెళ్లమూడి, పుష్పలీలా నగర్, బావిశెట్టివారి పేట, చెంచుల కాలనీ, వైఎస్ఆర్ కాలనీ, పోణంగి తదితర ప్రాంతాల్లో వాన నీటిలోనే ప్రజలు గురువారం దినచర్యలు ప్రారంభించుకున్నారు. విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు. ప్రభుత్వ కార్యాలయాలు, కళాశాలలు యథావిధిగా పని చేశాయి. క్యారేజీలు కట్టుకుని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దినసరి కూలీలు, మేస్త్రిలకు పని దొరకక తిరిగి ఇంటి బాట పట్టారు. గురువారం మధ్యమధ్యలో చిన్న చిన్న చినుకులు పడ్డాయి. వాతావరణం కారుమబ్బులు ఏర్పడ్డాయి.

నిలిచిన రాకపోకలు

నగరంలోని వన్‌టౌన్, టూ టౌన్ ప్రాంతాలను అనుసంధానం చేసే శ్రీనివాస థియేటర్ సమీపంలో ఉన్న రాజీవ్ స్నేహ వారధి (రైల్వే అండర్ పాస్) రాత్రంతా కురిసిన వానకు మునిగిపోయింది. అటువైపు రాకపోకలను నిలుపుదల చేస్తూ అధికారులు స్నేహవారధి గేట్లను మూసివేశారు. స్నేహవారధికి ఇరువైపులా ప్రజలు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

ఉధృతంగా తమ్మిలేరు ప్రవాహం

దాదాపు 14 గంటల పాటు నిరవధికంగా కురిసిన వాన కారణంగా నగరం చుట్టూ ఉన్న తమ్మిలేరు పాయల్లో వరద నీరు ఉధృతంగా ప్రవహించింది. అమీనాపేట వద్ద ఉన్న శనివారపు పేట కాజ్ వే వద్ద దాదాపు కాజ్ వేను అనుకుని నీరు ప్రవహించింది. ఎగువన నాగిరెడ్డి గూడెం డ్యామ్ నుంచి కూడా వరద నీరు తమ్మిలేరులోకి ప్రవేశించడంతో నగరంలో తమ్మిలేరు ఉరకలెత్తింది. ఎగువ ప్రాంతాల్లో వర్షం కొనసాగితే ఈ వరద ప్రవాహం మరింత పెరిగి ఏలూరు నుంచి శ్రీరామ్ నగర్, శనివారపు పేట, దుగ్గిరాల, పినకడిమి తదితర ప్రాంతాలకు సంబంధాలు తెగిపోయే ప్రమాదం ఉంది. బుధవారం రాత్రి 7 గంటల సమయానికి ఏలూరు అర్బన్ ప్రాంతంలో 26.6 మిల్లీ మీటర్లు, గురువారం ఉదయం 8.30 గంటలకు 97.8 మి.మీ., బుధవారం రాత్రి 7 గంటలకు ఏలూరు రూరల్ ప్రాంతంలో 28.2 మి.మీ., గురువారం ఉదయం 8.30 గంటలకు 85 మి.మీ. వర్షపాతం నమోదైంది.



ఏలూరు కొత్తబస్టాండులోని పరిస్థితి



శనివారపు పేట కాజ్ వే వద్ద ఉధృతంగా ప్రవహిస్తున్న తమ్మిలేరు

ముంపులో వరి పొలాలు



నీటమునిగిన వరి పొలాలు

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం పాలగూడెం పంచాయతీ పరిధిలో ఆశ్రం వైద్యశాల ఎదుట వ్యాసకాని బ్రిడ్జి పక్కన దాదాపు 60 నుంచి 70 ఎకరాల్లో వరి పొలాలు నీట మునిగాయి. ఎడతెరిపి లేకుండా రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు వరి పొలాలు చెరువులను తలపించాయి. వరి నాట్లు పది రోజులకే నీట మునగడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. చేలల్లో నీటిని దిగువకు తరలించే ఏర్పాట్లలో రైతులు నిమగ్నమయ్యారు.

అందని ఆడబిడ్డ నిధి

- మహిళల ఎదురుచూపులు
- నిలువునా మోసం చేసిన కూటమి ప్రభుత్వం

దెందులూరు: వైఎస్సార్ సీపీ హయాంలో అమలైన సంక్షేమ పథకాలకు కూటమి ప్రభుత్వం మంగళం పాడింది. అధికారంలోకి వస్తే ఆడబిడ్డ నిధి పేరుతో మహిళలకు ప్రతినెలా రూ.1500 సాయం అందజేస్తామని ప్రకటించిన కూటమి నాయకులు ప్రభుత్వం ఏర్పడి ఈ ఏడాది గడిచిపోయినా ఆ పథకంపై స్పష్టత ఇవ్వడం లేదు. దీంతో ఏలూరు నియోజకవర్గంలో లక్షా 16 వేల 30 మంది మహిళలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఆడబిడ్డ నిధి సొమ్ము ఎప్పటి నుంచి అమలు చేస్తారో అని వాపోతున్నారు.



మహిళా సంక్షేమం ఎక్కడ?



మహిళల సంక్షేమానికి ఎన్నికల ముందు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నీ అటకెక్కాయి. మహిళలకు నెలకు రూ.1500 ఇస్తామని చెప్పారు. వాటిని ఎక్కడ అమలు చేశారో కూటమి నాయకులకే తెలియాలి. కూటమి ప్రభుత్వ హయాంలో మహిళా ప్రజాప్రతినిధులకు ప్రాధాన్యత ఎక్కడ ఉందో తెలియడంలేదు.

– మందలి సరస్వతి, జెడ్పీటీసీ

నెలకు రూ.1500 ఊసే లేదు



అర్హులైన మహిళలకు నెలకు రూ.1500 అందిస్తామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని చంద్రబాబు నిలబెట్టుకోలేకపోయారు. ఎన్నికల ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలు ఎప్పటికీ నెరవేర్చరని అందరికీ మరోసారి అర్థమైంది. ఆడవారికి ఆశపెట్టి మోసం చేస్తే బాబుకు తప్పకుండా బుద్ధి చెబుతారు.

– లక్ష్మీదుర్గ, గ్రామ సర్పంచ్, కోటేశ్వరదుర్గాపురం

మోసం చేయడం బాబు నైజం

మహిళలను మోసం చేయడం చంద్రబాబుకు అలవాటే. ఎన్నికల ముందు సంక్షేమం పేరుతో అబద్ధపు హామీలు ఇచ్చి తరువాత వాటిని అమలు చేయకుండా తప్పించుకోవడం చంద్రబాబు నైజం. కూటమి నాయకులు ఎన్నికల ముందు హామీ ఇచ్చిన ఆడబిడ్డ నిధి ఎప్పుడు ఇస్తారో నేటికి స్పష్టత ఇవ్వడంలేదు.

– తొత్తడి వేదకుమారి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి

శ్రీశ్రీ కళావేదిక జాతీయ ప్రధాన ప్రణాళికాధికారిగా పార్థసారథి



ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సాహిత్య, సాంస్కృతిక, సామాజిక సేవాసంస్థ శ్రీశ్రీ కళావేదిక జాతీయ ప్రధాన ప్రణాళికాధికారిగా టి.పార్థసారథి ఎంపికయ్యారు. ప్రస్తుతం ఆ సంస్థ జాతీయ ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహిస్తున్న రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, విశ్రాంత విద్యాధికారి (ట్రైబల్ వెల్ఫేర్, ఐటీడీఏ) పార్థసారథి సాహితీ, సాంస్కృతిక రంగాలకు అందిస్తున్న విశేష సేవలకు గుర్తింపుగా ఈ పదవికి ఎంపిక చేసినట్టు శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ చైర్మన్ కత్తిమండ ప్రతాప్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆయన నుంచి నియామక పత్రం అందుకున్న పార్థసారథి మాట్లాడుతూ అంతరించిపోతున్న కళలను ఆదరించడానికి, గ్రామీణ స్థాయిలో ప్రతిభ ఉండీ ప్రోత్సాహం కరువైన కళాకారులను గుర్తించి వారికి తగిన అవకాశాలు కల్పించడానికి శ్రీశ్రీ కళావేదిక ద్వారా కృషి చేస్తామని పేర్కొన్నారు.

17న 'ట్రంప్ సుంకాలు - ఆక్వా కుదేలు'పై సమావేశం

ఏలూరు (టూటౌన్): ట్రంప్ సుంకాలు – ఆక్వా కుదేలు అనే అంశంపై సీపీఎం ఆధ్వర్యంలో 17న ఉదయం 11 గంటలకు స్థానిక పవర్ పేటలోని సీపీఎం జిల్లా కార్యాలయంలో నిర్వహించే రౌండ్ టేబుల్ సమావేశాన్ని విజయవంతం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి గురువారం విజ్ఞప్తి చేశారు. ఆక్వా రైతులు, వివిధ రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల నాయకులంతా పాల్గొనాలని కోరారు. ట్రంప్ ఎంత దుర్మార్గం చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మౌనం వహించడం ఆందోళనకరమని రవి పేర్కొన్నారు.

జెడ్పీటీసీ ఎన్నికల్లో ప్రజాస్వామ్యం ఖూనీ

వైఎస్సార్ సీపీ చింతలపూడి కన్వీనర్ విజయరాజు

చింతలపూడి : పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఎన్నికల్లో ప్రజాస్వామ్యం ఖూనీ అయ్యిందని వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభ విజయరాజు గురువారం ఆరోపించారు. ఎన్నికలు సజావుగా నిర్వహించాల్సిన ఎలక్షన్ కమిషన్, అధికార సిబ్బంది అధికార పార్టీతో కుమ్మక్కయ్యారని తెలిపారు. దొంగ ఓట్లు వేశారని తమ అధినాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాక్షాధారాలతో ఫిర్యాదు చేసినా ఇంతవరకు పట్టించుకోకపోవడం శోచనీయమని పేర్కొన్నారు. తమ పార్టీకి చెందిన ఏజెంట్లను కూడా పోలింగ్ బూత్‌లోనికి రానివ్వకుండా, కనీసం అభ్యర్థులు కూడా ఓట్లు లేకుండా అడ్డుకున్నారని విమర్శించారు. పోలింగ్ బూత్‌లలో రిగ్గింగ్ జరుగుతుంటే అధికార యంత్రాంగం ఎందుకు అడ్డుకోలేదని ప్రశ్నించారు. పులివెందుల, ఒంటిమిట్ట జెడ్పీటీసీ ఎన్నికలను రద్దుచేసి కేంద్ర సాయుధ బలగాల పర్యవేక్షణలో తిరిగి ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సంఘం తన ప్రతిష్టను, నిజాయతీని కాపాడుకోవాలంటే ఈ ఎన్నికలను వెంటనే రద్దు చేయాలని కోరారు. ఎన్నికల్లో అధికార పార్టీకి సహకరించిన ప్రభుత్వ అధికారులపై విచారణ చేసి ఘటనపై చర్యలు తీసుకోవాలని కోరారు. పులివెందులలో టీడీపీకి వచ్చిన ఓట్లు, వైఎస్సార్ సీపీ అభ్యర్థికి వచ్చిన ఓట్లను ఒక్కసారి పరిశీలిస్తే అక్కడ రిగ్గింగ్ జరిగిందనేది స్పష్టం అవుతుందని వివరించారు. కేవలం జెడ్పీటీసీ ఎన్నికల్లో గెలవడానికి అక్రమాలకు పాల్పడడం సిగ్గుచేటని తెలిపారు. ఈ ఎన్నికలపై విచారణ చేయించాలని డిమాండ్ చేశారు. అధికారం చేపట్టిన నాటి నుంచి అప్రజాస్వామిక విధానాలకు పాల్పడుతున్న కూటమి ప్రభుత్వం పతనం అవ్వడం ఖాయమని పేర్కొన్నారు.

ముగ్గురాళ్ల వాగు వద్ద ప్రమాద హెచ్చరిక

టి.నరసాపురం: మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు ముగ్గురాళ్ల వాగు పొంగి ప్రవహిస్తోంది. బండివారిగూడెం, మక్కినవారిగూడెం గ్రామాల మధ్య ముగ్గురాళ్ల వాగు పొంగి ప్రవహిస్తుండడంతో ఆ మార్గంలో వాహన రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. తహసీల్దార్ టి.సాయిబాబా, పోలీసు సిబ్బంది వాగును పరిశీలించారు. ప్రమాద హెచ్చరికలు జారీ చేశారు. పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు.